కర్రోడు

"Face is the index of the Mind' అన్న వాక్యం నాకు వర్తించదనే నా అభిప్రాయం... ఎందుకంటే నా ముఖం చూస్తున్న వాళ్లెవరూ నాకంటూ కొన్ని అభిప్రాయాలున్నాయని అనుకోరు.. నాలో ఎప్పుడూ ఏవేవో భావాలు సుళ్ళు తిరుగుతుంటాయని నేను ఉన్నత విద్యావంతుడినని, సామాజిక సమస్యలమీద ఎన్నో రచనలు చేసానని నన్ను చూస్తే ఎవరికీ అనిపించదు... గొప్ప మేధావిని కాకున్నా నేనూ మేధావినేనని, ఏ అభిప్రాయలూ లేకుండా బతకడం మృతప్రాయమైందని భావిస్తుంటాను నేను..

ఏమాత్రం అందంగా లేని నన్ను సౌందర్యారాధకుడని కూడా నన్ను చూస్తున్న వాళ్లెవరూ అనుకోరు... నల్లవాడిగా, దళితుడిగా ఎన్నో అవమానాల నెదుర్కొన్న నాలో సౌందర్యారాధన ఉందంటే ఎవరూ నమ్మరు... నన్ను నెలరోజులుగా ఓ నల్లటి కుర్రాడి రూపంలో ఓ సమస్య వెంటాడుతుంది. ఆ పిల్లవాడెవరో నాకు తెలియదు. నల్లగా... మసికుండలా... ఆరిపోయిన కొర్రాయిలా... సింగరేణి బొగ్గులా... నల్లతనమంతా మూర్తీభవించినట్టుగా ఉంటాడతను... అతన్ని చూస్తేనే నాకసహ్యం...ఒక్కోసారి ఢోకొస్తుంది కూడా... నేను ప్రస్తుతం ఓ యూనివర్శిటీకే వైస్‌ఛాన్సలర్‌గా వున్నాను. మేధావిగా, నీతిమంతుడిగా నాకు పేరు ప్రతిష్టలూ వున్నాయి. అలాంటి నాకా కుర్రాడో సమస్య కావడం చికాకుగానే ఉంది. మా ఇంట్లో ఎవ్వరూ లేని సమ యం చూసి నా దగ్గరి కొస్తున్నాడు. తనకేదైనా పనిప్పించమని వేడుకుంటున్నాడు.

నేనెంత చీదరించుకుంటున్నా, కసురుకుంటున్నా ఆ రోజుకు వెళ్ళిపోతున్నాడు. తర్వాత మళ్లీ వస్తున్నాడు...నేను తలుచుకుంటే అతనికేదైనా సాయం చేయగలను. కాని అతన్నిచూస్తుంటే చేయాలనిపించడంలేదు.

ఇకారోజు ఆ కుర్రాడితో ఏదోటి తేల్చుకోవాలను కున్నాను... ఇకముందు నా దగ్గరికి రాకుండా చేయాలనుకున్నాను... ఆ కుర్రాడు రానే వచ్చాడు...

'నేను నీకేం సాయం చేయలేనని మొత్తుకుంటున్నా నా దగ్గరకే ఎందుకొస్తున్నావు ? పో... ఇంకెవరి దగ్గరికైనా పో'' అన్నాను కోపంగా.

''నాకెవరూ లేరుసార్! అమ్మ ఒక్కతే వుండేది. ఆమెను నేను కడుపులో పడింతర్వాత

వెలివేసారట. ఆమె రెన్నెల్ల క్రితమే చనిపోయింది... చనిపోయేప్పుడు మీ దగ్గరికి పొమ్మని చెప్పిపోయింది. బంధువులెవరూ నన్ను దగ్గరకు రానివ్వరు. నేనెవరి దగ్గరికని పోవాలి?'' అన్నాడు దీనంగా.

''నా దగ్గరికెందుకు పొమ్మంటుంది మీ అమ్మ. మీ నాన్న లేడా?'' ప్రశ్నించానతన్ని.

''ఉన్నా లేనట్టే సార్.''

ఆ బాబుపైనాకున్న అసహ్యాన్ని ఎన్ని విధాల ప్రదర్శించినా వాడు నన్ను వదలకపోవడం నాకు కోపం తెప్పిస్తుంది. పైగా నాపై ఏదో హక్కున్నట్టు వాడి బాగోగులు చూడటం నా బాధ్యతే అయినట్టు ప్రవర్తిస్తున్న ఆ కుర్రాడిని కొంత కఠినంగానే మాట్లాడి పంపించాలనుకున్నాను.

''మనిషికో మాట. పశువుకో దెబ్బన్నారు. నీకు మాటలతో సరిపోకుంటే తన్ని పంపించమంటావా? పొమ్మని ఎన్నిసార్లు చెప్పాలి? నా దగ్గరకు రావద్దని ఎంత చెప్పినా వినవేంటి? ఏంటిదంతా?'' ఆగ్రహం వెళ్లగక్కాను.

అయినా ఆ బాబేం తొణకలేదు.

''ఎందుకుసార్... మీరు నన్ను అంతగా అసహ్యించుకుంటున్నారు. నేనేం తప్పు చేసాను?''

''నీ ముఖాన్ని చూస్తే ఎవరు మాత్రం అసహ్యించుకోకుండా ఉంటారు?''

నా మాటలతో మసిబొగ్గులా వున్న ఆ కుర్రాడి ముఖం మరింత నల్లబడింది... చిన్నబోయింది... కొద్ది క్షణాలేం మాట్లాడలేదతను.

''సార్... నేను పుట్టగానే కోల్ ఇండియా బొగ్గు ముద్ద పుట్టిందన్నారట... నేనెలా ఉన్నానో నాకు బాగానే తెలుసు కాని నాకీ రూపం రావడానికి కారణం నేను కాదనుకుంటాను..'' అన్నాడు నన్ను చూస్తూ.

''కారణమెవ్వరైతే ఏం కాని నేను నీకేం చేయలేను. నన్ను వేధించకు'' అన్నాను.

''నన్నందరూ కర్రోడా' విసుక్కుంటారు సార్.. నేను కర్రెగా వున్నమాట నిజమే. అందుక్కారణం మా అమ్మో నాన్నో అయ్యుంటారు... మా నాన్న ఎలాగుంటాడో నాకు తెలియదు... మా అమ్మ మాత్రం సినిమా నటికంటే అందంగా, మెరుపు తీగవలే వుండేది. మరి నాకొచ్చింది మా నాన్న వారసత్వమే కద! నాకీ కర్రోడి రూపమిచ్చిన మా నాన్నను తిట్టాలా సార్...''

కర్రోడన్న మాట నా హృదయానికి సూటిగానే తగిలింది... ఎక్కడో మనసు పొరల్లో కెలికినట్లయింది... నా హృదయాంతరాలను తాకినట్టయింది. కుర్రాన్ని తొందరగా వదిలించుకోకుంటే ప్రమాదమే ననుకున్నాను.

''నీకథంతా వినాల్సిన అవసరం నాకేంలేదు... వెళ్లిపో'' విసుక్కుంటూ అన్నాను.

''సార్ నేనెంత వేడుకుంటున్నా మీరు నన్ను కనికరించడంలేదు. పైగా అసహ్యించుకుంటున్నారు. నేనంటే మీకెంత ఏవగింపో మిమ్మల్ని చూస్తేనే అర్థమవుతుంది. కాని ఒక్కసారి మీరు మీ ముఖాన్ని అద్దంలో పరీక్షగా చూసుకోండి... మీరేపాటి అందంగా వున్నారో మీకే అర్థమవుతుంది. మీ చిన్ననాటి ముఖాన్నోసారి జ్ఞప్తికి తెచ్చుకోండి. అంటే సరిగ్గా నా వయసున్నప్పటి ముఖాన్ని. ఆ ముఖం నా ముఖం కంటే అందంగా, భిన్నంగా ఉందేమో గుర్తు తెచ్చుకోండి. మీ ఇప్పటి పెద్దమనిషి డ్రెస్సును తొలగించి చిరిగిన నిక్కరు, అంగీలతో మిమ్మల్ని మీరు చూసుకోండి. మీకు నాకు ఏమన్నా తేడా వుందేమో అర్థమవుతుంది. సరే.. పోతున్నాను సార్...

ఉన్నొక్క అమ్మ పోయింది. చనిపోతూ మీ దగ్గరకెళ్లమని చెప్పింది. మీకేమో నన్ను చూస్తేనే అసహ్యం... నే బోతున్నాను... ఎంతో మంది దిక్కులేని పిల్లల్లా చెత్తకుండీల వెంటో మురికి కాలువల పక్కనో హోటళ్లలో చాకిరీ చేసుకుంటూనే బతుకుతాను. మా అమ్మపేరు చెప్పలేదు కదాసార్... సుజాత'' అని నాకు మాట్లాడటానికి అవకాశమివ్వకుండానే గబగబా వెళ్లిపోయాడు.

ఆ కుర్రాడి మాటలు నన్ను ఆలోచనలో పడవేసాయి. నాలో కల్లోలం రేపాయి. కర్రోడు... కర్రోడు... కర్రోడు ఈ మాటలేనా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

లేచి నిల్చున్నాను.. అద్దం ముందుకెళ్లాను... నలుపంతా రాశిగా పోసినట్టున్న నా ముఖాన్ని ఆ కుర్రాడి ముఖంతో పోల్చుకున్నాను... నా ముఖమే మరింత నల్లగా కనబడింది. నా చిన్నప్పటి ముఖాన్ని కళ్లముందు సాక్షాత్కరింప జేసుకున్నాను... ఆ రూపం కుర్రాడి రూపం ముమ్మూర్తులా ఒకటిలాగే కనిపించాయి... ఆ కుర్రాడిలో చిన్ననాటి నా ప్రతిబింబాన్ని చూసాను.. అంటే ఆ బాబు ఆ బాబు ఆబాబులో నా పోలికలు... తల్లిపేరు సుజాత...

నాలో రకరకాల సంఘర్షణ

నాలుగేళ్ల కింటి వరకు నేనుభవించిన క్షోభ, అవమానాలు నా కళ్ళముందు కదులుతున్నాయి... నా తల్లి విమల... నా భార్య మాలతి... ఇంకా సుజాత... నా బాల్యం ఒక్కొక్కటే తెరమీది బొమ్మల్లా నా కళ్లెదుట కదులుతూ నన్ను గతంలోకి లాక్కెళుతున్నాయి.

డెకొలాం కాట్‌పై వేసున్న కుర్లాన్ పరుపు, మెత్తల మీద వెల్లకిలా పడుకున్నాను.

★★★

''కర్రోడా... ఓరి కర్రోడా... ఇట్రారా'' అన్న అమ్మ పిలుపు విని నేను అమాయకంగా నవ్వాను... నా కప్పుడు ఏడెనిమిదేళ్లుంటాయేమో... అంతకు ముందా పిలుపును ఎన్నోసార్లు విన్నా నాకు జ్ఞాపకమున్నది మాత్రం ఆరోజునుంచే.

నేను నవ్వడం చూసి అక్కడే వున్న మా మేనమామ, అత్త నవ్వారు.

''వానికి పేరుందికదా! కృష్ణ అని పిలిస్తే నీదేం బోతుంది? పిల్లలనలా కించపరుస్తూ పిలవడమేం బాగుండదు విమలా!'' అన్నాడునాన్న.

''కృష్ణ అన్నా నలుపే కద బావా..! అక్క అచ్చ తెలుగులో పిలుస్తుందేంబాయే... నీకు నీ రూపంలో వున్న కొడుకును చూసుకుంటే ముద్దు... ఎంతైనా కాకిపిల్ల కాకికి ముద్దేకదా!''

మా మేనమామ మాటలకంతా నవ్వారు.

సాధు స్వభావుడు, సజ్జనుడైన మా నాన్న వాళ్లనేమన్లేదు.

అయితే వాళ్లెందుకు నవ్వుతున్నారో నాకర్థం కాలేదు.

మానాన్న ఒక్కడే ఉన్నప్పుడోసారి అడిగాను.

''కర్రోడంటే ఏంటి నాన్నా?'' అని...

''నల్లగా, అసహ్యంగా వుండేవాళ్లను కర్రోడంటారు... అదో తిట్టులాంటిది. పసివాడివైన నీకు దాన్నిగూర్చి తెలియక నవ్వుతున్నావు'' అని నన్ను దగ్గరకు తీసుకున్నాడు నాన్న.

అప్పుడు కాని నన్ను కర్రోడంటూ నవ్వేవాళ్లెందుకు నవ్వుతారో అర్థం కాలేదు. కాని నన్ను కన్నతల్లే తన పిల్లల రూపాలను కడుపులో దాచుకొని ఉండక తల్లే ఇలా పిలవడం నాకు తీరని వేదనే

కలిగించింది.

అప్పట్నుంచి నన్నెవరు కర్రోడని పిలిచినా బాధగా వుండేది...

కొందరితో కొట్లాటకు కూడా దిగేవాన్ని.

''మీ అమ్మే నిన్ను కర్రోడని పిలుస్తుంటే నువ్వేమొ మమ్ములను వద్దంటావేంటి? నువ్వు కర్రగ లేకుంటే ఎర్రగున్నావా మరి... బాగ ఫోజులుకొట్టవడ్తివి...''

''ఇదుగో కృష్ణా! నువ్వు ఎవరికన్న ఎర్రగున్నవో ఒక్కసారి పోల్చుకో... కొమట్ల పిల్లలు నీకంటే నేను తక్కువ కర్రగున్ననని మురుస్తరట... అనేవారు పిల్లలు.

నేను పెరుగుతున్నా అమ్మ నన్నలాగే పిల్చేది. కన్నతల్లి నన్నంత అవమానకరంగా పిలుస్తుంటే నాకెంత బాధగా వుండేదో ఆమె గమనిచేందే కాదు.

ఓసారి నన్నెందుకలా పిలుస్తావని అమ్మనే అడిగాను.

''బొగ్గు ముద్దలా ఉన్న నిన్ను ఎక్కడికి తీసుకెళ్లినా నాకు అవమానమే ఎదురవుతుంది. నిన్ను నా కొడుకని చెప్పుకోవడానికే సిగ్గవుతుంది. దళితకులం వాడివంటే అచ్చం అలాగే వున్నావు... నా యుగతా పిల్లలందరికీ నాలాగా బంగారు వర్ణమొచ్చింది... నీకేమో జీడిగింజ రంగొచ్చింది. నా కర్మ.. నువ్వు పుట్టకున్నా బాగుండేది...''

బంగారు మేనిఛాయతో ఎంతో అందంగా వున్న మా అమ్మకు నాలాంటి వికారి పుట్టడం ఆమె కవమానకరంగా వుందన్న విషయం నాకు షాకిచ్చినట్టయింది. అప్పట్నుంచే నాలో రంపపు కోత మొదలైంది.

''అయితే అమ్మా నువ్వింత అందగా వున్నావుకదా! నాకీ రంగెందుకొచ్చింది?''

నా ప్రశ్నతో అమ్మ ముఖం మ్లానమైంది. కొద్దిసేపేం మాట్లాడలేదామె.

''సాధారణంగా పిల్లలకు తల్లిదండ్రుల్లో ఎవరివో ఒకరివో ఇద్దరివో లేక వాళ్ల వంశవృక్షం వాళ్లవో రంగు, రూపం, గుణాలు, అనువంశిక లక్షణాలుగా వస్తాయి. నీకు నీ తండ్రి రూపమొచ్చింది... చివరగా పుట్టిన నిన్ను పుట్టినప్పుడే గొంతు పిసికి పారేసినా బాగుండేది... మా అందరి మధ్య నిన్ను చూస్తేనే అసహ్యం...''

ఆమె మాతృహృదయం చలించిందేమో కొద్దిసేపేడ్చింది...

''దళితకులంలోనే పుట్టినా మానాన్న క్రైస్తవుడిగా మారాడు. కొంత చదువుకున్నాడు. మాది ఎంతో కొంత చదువుకున్న కుటుంబమే. నేను ఊళ్లో ఉన్నంత వరకు చదివాను. మీ నాన్న తండ్రి చెప్పులు కుట్టేవాడు. కొడుకును కష్టపడి చదివించాడు... అప్పట్లో దళితుల్లో చదువుకున్నవాడు, ఉద్యోగం చేసేవాడు దొరకడం చాలా కష్టంగా వుండేది. అందుకే మీ నాన్నతో నా పెండ్లి నిర్ణయించారు మా నాన్న అమ్మలు. తుమ్మమొద్దులా వున్న మీ నాన్నను మొదటిసారి చూడగానే కళ్లు మూసుకున్నాను. నా స్నేహితురాండ్రు నాకాబోయే భర్తను చూసి నవ్వారు. హేళన చేసారు. దెప్పి పొడిచారు. నేనాయనను చేసుకోనని ఎంత మొత్తుకున్నా మా వాళ్లు వినలేదు. నా కాతనితో పెళ్లి తప్పలేదు. మీ నాన్నను నా ప్రక్కన చూస్తేనే నాకు ఒళ్లు జలదరించేది... మీ నాన్న రూపమే నీకొచ్చింది...''

అమ్మ మాటను తు.చ తప్పకుండా పాటించే నాన్న నాకు తెలుసు... అయితే అమ్మ ఎప్పుడూ నాన్నను బహిరంగంగా కర్రోడనో, మరో విధంగానో అవమానించడం నేను చూడ్లేదు... నాన్నమీదున్న

అయిష్టాన్ని కసిని నామీద తీర్చుకుంటానికి సిద్ధంగా ఉన్నట్టు కనబడిందమ్మ నాకు.

''అమ్మా! అక్కయ్యకు, అన్నయ్యలకొచ్చినట్టు నాక్కూడా నీ రూపమొస్తే ఈ అవమానాలుండేవి కావు...'' అన్నాను.

''భార్యా భర్తలిద్దరిలో ఎవరి వ్యక్తిత్వం డామినేట్ చేస్తే పిల్లలకు వాళ్ళ లక్షణాలు వస్తాయంటారు. అందుకే మీ నాన్నను నేనే డామినేట్ చేసాను... అయినా నీకు ఆయన రంగు రానే వచ్చింది.'''

నన్ను తనవెంట ఎక్కడికీ రాకుండా ఆజ్ఞాపించిందామె.

నా కంటె కురూపులుగా వున్న ఎంతోమంది నల్లవాళ్ళున్నారు. మరి వాళ్ళంతా నాలాగే అవమానాల నెదుర్కొంటున్నారా? ఎన్నో సార్లనుకున్నాను.

నేను దళితుడిగా పుట్టడం, దానికితోడు అంత నల్లగా వుండటం నేనవమానాలు పొందడానికి తోడయ్యాయనుకున్నాను.

''వయసుతో వంకలు తీరుతాయంటారు... నువ్వు పెరుగుతున్నకొద్దీ నీ శరీరంలో వస్తున్న మార్పులు, వయసు నీ శరీరాన్ని ఆకర్షణీయంగా తయారుచేస్తాయి'' అన్నాడో ఆత్మీయుడు.

''ఎంత వయసొచ్చినా రంగు పోయేది కాదుగదా!'' అన్నాడింకో మిత్రుడు.

అదృష్టవశాత్తు నాకు మానాన్న ఇంటలిజెన్స్ వచ్చింది.

నేనెదుర్కొంటున్న అవమానాలతో నాలో పట్టుదల కసి పెరిగింది.

''నవ్విన నాపచేనే పండుతుందంటారు... ఎన్నో అవమానాల నెదుర్కొన్న ఈ సమాజంలో నువ్వు గౌరవింపబడాలి. అందుకొకే మార్గముంది... నువ్వు బాగా చదువుకోవలి... ఉన్నత స్థితిలోకి రావాలి...'' అని చెప్పాడు నాన్నోరోజు.

''కృష్ణా! నాకున్న ఉద్యోగంవల్ల నీకు ఆర్థికపరమైన ఇబ్బందులు లేవు... నేనైతే ఆ ఇబ్బందులూ ఎదుర్కొన్నాను... నా కులం పేదరికం, నా నలుపు వర్ణం అన్నీ నన్ను అవమానానికే గురిచేసాయి. నేను బంధువులింటికి ఇతర పార్టీలకు వెళితే కూరలు వడ్డించడంలో కూడా విచక్షణ చూపేవారు. ఆయాలు సాయాలతో వున్న మంచి మాంసం ముక్కలు వాళ్ళు తినేవారు. నాకింత బొక్కల పులుసు పోసేవారు. మంచి మంచి ముక్కలు వాళ్ళు తింటుంటే నాకు కళ్ళవెంట నీళ్ళచ్చేవి. ఈ అవమానాలన్నిటికీ ఒక్కటే సమాధానం... నువ్వందరిలో గుర్తింపబడేలా చదవాలి... ఉన్నత స్థితిలో కెళ్ళాలి'' అన్నాడు మరోసారి నాన్న.

నాలో పట్టుదల పెరిగింది. బాగా చదవడం మొదలుపెట్టాను... రెండేళ్ళలో అన్నిట్లోనూ నాకే ఫస్టుమార్కులు రావడం మొదలైంది.

''కర్రోడా కర్రోడా... నువ్వు క్లాసుఫస్టురా'' అన్నాడు రాజిరెడ్డి సారు.

''చూడటానికట్లున్నాడు కాని కర్రోడు చదువుల ఉషారే...''

మెచ్చుకోలులోనూ వ్యంగ్యం... తిట్టుపదం...

నేను ఫస్టు రాంకులు తెచ్చుకుంటున్నా మా అమ్మకు నాపై ఉన్న చిన్నచూపు కర్రోడా అని పిలవడం పోలేదు.. బయట అవమానాలూ జరుగుతూనే వున్నాయి.

నేను కాలేజీ కొచ్చినా చిన్నతనం నుండీ నన్నవమానాలకు గురిచేస్తున్న అంశాలు నన్ను, నా మనసును తొలుస్తూనే వున్నాయి. అప్పుడే నాలో అన్వేషణ ప్రారంభమైంది... ఈ నల్లతనం యొక్క

మూలాలను వెతుకుతూ లోతుల్లోకి వెళ్లడం ప్రారంభించాను... నాలో కొన్ని ఆదర్శాలు చోటు చేసుకుంటున్నాయి. మనుషులను ప్రేమించడం మొదలుపెట్టాను. బాగా చదువుకుంటేగౌరవం కాళ్లదగ్గరకు నడిచి వస్తుందనుకుంటూనే దేనికోసమో వెతుకున్నాను. ముఖ్యంగా మా అమ్మ నన్ను కర్రోడా అని పిలుస్తూ చేస్తున్న గాయానికి మందుగా మా అమ్మకంటే అందమైన అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలన్న నిర్ణయం నాలో బలపడుతుంది. అందుకు మార్గం చదువు ద్వారా లభించే ఉన్నతస్థితే...

నా చదువు. పరిశోధన సమాంతరంగానే సాగుతున్నాయి.

''అమ్మా! భారతీయ పురాణాల్లోని రాముడు, దశావతారాల్లో సంపూర్ణావతారంగా చెప్పబడే శ్రీకృష్ణుడు నల్లనివాళ్లే కదమ్మా! నీకు నలుపంటే ఎందుకంత అసహ్యం?'' అన్నాను.

''నువ్వు నల్లగున్నానని వాళ్లతో పోల్చుకుంటున్నావా? అవి పురాణకథలు మాత్రమే'' అంది అమ్మ.

కథలు అనే దగ్గర నొక్కి మరీ చెప్పింది.

''బాబూ! శ్రీకృష్ణా అమ్మ ఏదో అంటుందని నువ్వీ విషయం గూర్చి పదే పదే ఆలోచించకు. అమ్మ పైపై మెరుగుల బతుకులనేచూస్తుంది. ఆమెదదో తీరు మనస్తత్వం. దళితులచే, గిరిజనులచే, రాక్షసులచే ఇంకెంతోమంది జనాలతో పూజింపబడే లయకారకుడైన శంకరుడు నల్లనివాడే. అయితే ఈ నలుపు తెలుపు భేదం అనాదిగా ఏదో రూపంలో కొనసాగుతూనే వుంది. వున్నవాళ్ల, ఉన్నత కులాల వాళ్ల దేవుళు అందంగా ఉంటే, దళితుల, పీడిత కులాలవాళ్ల దేవుళ్లు ముఖ్యంగా క్షుద్ర దేవతలే... వాళ్లు భయంకరలంగానే ఉంటారు. ఈ విచక్షణాల జోలికి పోకుండా బాగా చదువుకో'' అన్నాడు నన్ను నిమురుతూ నాన్న.

నా జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకుంటానికి మంచి స్థితిని పొందడానికి చదువునే మార్గంగా ఎన్నుకొని అహర్నిశలూ చదువుతున్నాను. ఇతర విషయాలను అధ్యయం చేస్తున్నాను.

పోస్టు గ్రాడ్యుయేషన్, డాక్టరేట్ డిగ్రీ సంపాదించుకున్నాను. నాకున్న దళితుడనే సర్టిఫికెట్‌తో నేరుగా యూనివర్సిటీలో రీడర్‌గా జాయినయ్యాను.

నా చదువు, ఉద్యోగం నాకు మెరుపు తీగలాంటి అందమైన అమ్మాయితో పెళ్లయేలా చేసాయి... మా అమ్మకంటే ఎన్నో రెట్లెక్కువ అందంగా వున్న నా భార్యను చూపి అమ్మ దిక్కు గర్వంగా చూసాను.

''కాకి ముక్కుకు దొండపండంటారే. అలా ఉంది మీ జంట. మీ నాన్న పరంపరే మీకొచ్చింది. ఆ అమ్మాయేం సంతోషంగా ఉంటుందని నేననుకోను.'' అన్న మా అమ్మ మాటలు నాకు హృదయ శల్యంగానే వున్నాయి... అమ్మా మాటలంటున్నపుడెవరూ లేకపోవడం కొంత నయమైంది.

''ప్రేమ, అందం అనేవి హృదయ సంబంధమైనవి... మాలతి నన్ను మనస్ఫూర్తిగా ఇష్టపడింది కాబట్టే పెళ్ళి చేసుకుంది'' అన్నాను మా అమ్మతో

''సరే మీరు సుఖంగా ఉండటం కంటే నాకు కావాల్సిందేముంది?'' అంది అమ్మ.

ఆరోజే మా మొదటి రాత్రి... ఎన్నో ఆశలతో ఊహలతో బెడ్ రూమ్‌లో కెళ్లాను. ఎన్నో అవమానాలనెదుర్కొన్న నాకు నా భార్య దగ్గర ఓదార్పు లభిస్తుందనుకున్నాను. ఆమె దగ్గరికెళ్లి కౌగిట్లోకి తీసుకోబోయాను.

నన్ను చూసి గజగజా వణుకుతూ దూరం జరిగిన మాలతిని చూస్తూ అలాగే నిల్చున్నాను.

చాచిన చేతులను దగ్గరకు తీసుకున్నాను. కొద్దిసేపాగి మాలతి-

''మీరంటే నాకేమాత్రం ఇష్టంలేదు. ఓ విధంగా చెప్పాలంటే అసహ్యం కూడా. మిమ్మల్ని పరీక్షగా చూస్తేనే నా ఒళ్లు జలదరిస్తుంది. మీ చేయి తాకితే తేళ్లు జెర్రులు పాకినట్టే... దయచేసి నన్నిప్పుడు ముట్టుకోవద్దు'' అంది.

ఆ మాటలు నా పక్కలో బాంబు పేలినట్టే పేలాయి... నా హృదయం రంపపు కోతకు గురైంది. నా నోటి నుంచి ఒక్కమాట కూడా పెగిలిరాలేదు.

''మీ ఆకారాన్ని, రంగును చూస్తేనే నాకు రోత పుడ్తుంది... కాటుక కొండలా, కాలిన కొరకంచులా ఉన్న మీకు నాలాంటి స్త్రీ కావాల్సి వచ్చిందా? కంతకు తగ్గ బొంత నన్నుట్టెందుకు చేసుకోలేదు?'' సూటిగానే అంది మాలతి.

ఆ మాటలు నా గుండెపై సూదులు గుచ్చినట్టై బాధించాయి.

''నేనెందుకు నీలాంటి అందగత్తెను కోరుకున్నానన్న విషయం తర్వాతగాని ఇష్టం లేని దానివి నువ్వెందుకు నన్ను చేసుకున్నట్టు?'' అన్నాను.

''పురుషుడి అందంతో పనిలేదని మీరు మంచి స్థితిలో వున్నారని, మీతో నేనేదో సుఖపడ్తానని నన్ను బలవంతంగా వివాహానికొప్పించారు మా పెద్దలు. నా గొంతు కోసారు... నాకు చిన్నతనం నుంచీ నలుపంటే అసహ్యం. అయినా మీతో ఈ పెళ్లి తప్పలేదు. నేను మీతో కాపురం చేసినా కళ్లు మూసుకునే తప్ప మనస్ఫూర్తిగా కాదు... దయచేసి కొద్దిరోజులు నన్ను వదిలిపెట్టండి'' అంది మాలతి.

నా మనసు తీరని గాయానికి గురై బాధపడ్తుంటే ఆరోజు రాత్రంతా ఆలోచనలతోనే జాగరణ చేసాను. తాళికట్టిన అధికారంతో భార్యనైనా సరే బలవంతంగా ఆక్రమించుకోవడం నా నైజానికి పడనిది. నా మనసంతా వేదనతో కాగిపోతుండగా నిద్రలేని రాత్రులెన్నో గడిపాను. నెలరోజుల తర్వాత తల్లిగారింటికి పోయి వచ్చింది మాలతి... మా దేహాలు కలుసుకోవడానికనుమతించింది... తాను చేస్తున్న కాపురం మనస్ఫూర్తిగా మాత్రం కాదని మరోసారి స్పష్టంగా చెప్పింది.

''అటువంటప్పుడు బలవంతపు కాపురాలుదేనికి? విడాకులు తీసుకొని నీకిష్టమున్న అందగాడితో పెళ్లి చేసుకోవచ్చుగదా...''

నా మాటలు విని సివంగిలా లేచింది మాలతి.

''అలాంటిదాన్నయితే పెళ్లెందుకు చేసుకునేదాన్ని? పెళ్ళంటే మీరేమనుకుంటున్నారు? అటు పెళ్లి ఇటు విడాకులా మనసుకు నచ్చని వాళ్లంతా విడాకులు తీసుకుంటూ పోతే మన దేశంలో మిగిలే జంటలు తక్కువే. మీరంటే ఇష్టమున్నా లేకున్నా నా మనసులోకి ఏ మగాడూ రాడు. మీరు నిశ్చింతగా ఉండండి.. పెళ్లనే ఒప్పందానికి నేను జీవితమంతా కట్టుబడే వుంటాను'' అంది.

''మరలాంటప్పుడు మనస్ఫూర్తిగానే కాపురం చేయొచ్చుగదా?''

''అది నా వల్లకాదు. మనసులో ఓ ముద్ర పడింతర్వాత దాన్ని తొలగించుకోవడమంత సులభం కాదు.. అయినా ప్రయత్నం చేస్తాను. అందుకు చాలాకాలం పట్టవచ్చు.'' అంది మాలతి...

నన్ను ద్వేషిస్తూనే నా శరీరాన్ని అసహ్యించుకుంటూనే నాతో కాపురం చేస్తానంటున్న మాలతి మనస్తత్వం నాకు మింగుడు పడడంలేదు. బహుశః ఏ భార్యా తన భర్తతో ఇలాంటి మాటలనలేదేమో! నేను మా నాన్న పరంపరను మోస్తుంటే నా భార్య మా అమ్మ పరంపరను మోస్తానంటుంది. ఆమె

మాటలు నన్ను తొలుస్తూనే వున్నాయి. చిన్నప్పట్నుంచి పడ్తున్న అవమానాలకు పెళ్లితోనైనా తెరపడుతుందనుకుంటే ఆ అవమానాలు నన్ను శాశ్వతంగా వెంటాడబోవడం నాకు భరించరాకుండానేఉంది. నేను భర్తనే అయినా నన్ను క్రోడా బొగ్గు కాలి అంటూ అవమానకరంగా పిలుస్తూనే ఉంది మాలతి. ఆమెను మెల్లమెల్లగా మార్చుకోవచ్చని నాకు నేను సమాధానం చెప్పుకున్నాను.

నలుపు, దళిత శబ్దాలకు గల మూలాలపై నా అన్వేషణను మరింత ఉధృతం చేసాను. అనేక పుస్తకాలు తిరగేసాను. మేధావులను కలుసుకున్నాను.. వాటిపై వచ్చిన డాక్టరేట్ థెసిస్‌లనూ చదివాను. అనేక సామాజిక విషయాలను తీసుకొని వ్యాసాలు రాసి ప్రచురించడం మొదలుపెట్టాను. మధ్య మధ్యన మాలతితో అనేక విషయాలను మాట్లాడుతూనే వున్నను.

''మన పురాణల్లోని అష్టావక్రుడు కురూపి... కాని అసాధారణ మేధావి. అతని రూపంవల్ల కీర్తి ప్రతిష్టలకేం భంగం కలుగలేదుకదా!''

''కబుర్లు కథలు చెప్పడానికి బాగానే వుంటాయి. కాని నిజీవితం వేరు.''

''మాలతీ అందమంటే కేవలం ఎర్రతోలు తీర్చిదిద్దినట్టున్న కండరాల సమూహామేనా? పై తోలును తీసి చూస్తే లోపలుండేదంతా అవే మాంసపు ముద్దలన్న విషయాన్ని మరిచిపోవద్దు... శారీరక సౌందర్యం కంటే హృదయ సౌందర్యం ముఖ్యం...''

''అంత తెలిసిన మీరు హృదయ సౌందర్యమున్న తుమ్మ మొద్దులాంటి ఓ అమ్మాయిని చేసుకోక నన్నెందుకు చేసుకున్నట్లు?''

ఆమె ప్రశ్నకు నా దగ్గర సమాధానం లేదు.

నా రచనలతో నేనుమేధావిగా పేరు తెచ్చుకుంటున్నాను. ఉద్యోగంలోనూ అంచెలంచెలుగా ఎదుగుతున్నాను. నాకున్న కులం సర్టిఫికెట్ ఉద్యోగంలో ఎదుగుదలకు మరింత దోహదం చేస్తుంది.

''మన పిల్లలకు మీ రూపు రాకూడదు... రాదుకూడా'' అందోరోజున మాలతి.

''అదెలా సాధ్యం? పిల్లలకు తల్లిదండ్రుల్లో ఎవరినైనా లేక ఇద్దరివి కలిసైనా పోలికలు రావచ్చుకదా'' అన్నాను.

''ఎవరి జీన్స్ డామినేట్ చేస్తే పిల్లలకు వాళ్ల లక్షణాలొస్తాయంటారు. నా జీవితాన్ని మీలాంటి క్రోడికి ధారదత్తం చేసినందుకు నాకిదన్నా మిగలనివ్వండి''

ఆమె తర్కంలో ఎక్కడో లోపమున్నట్టనిపించింది నాకు

నేనెన్ని విధాల ఎదుగుతున్నా నన్నామెతో క్రోడా అని పిలువకుండా నిలుపలేక పోతున్నాను. ఆమె నన్నలా పిలుస్తూ అవమానిస్తుంటే నాలోని పరిశోధనా కాంక్ష మరింత లోతులకెళ్లడానికి దోహదపడింది.

భగవంతుని రూపాన్నే నల్లగా చేసింది బహుశా నల్లవాళ్లలో దళిత జాతుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడానికేమో ననిపించింది నాకు. దక్షిణాఫ్రికాలో మహాత్మాగాంధీ లాంటివాడే వర్ణవివక్షకు గురికావడం గూర్చి చదివిన నాకు బాధేకలిగింది. అతడు పొందిన అవమానాలు అతన్ని మహాత్ముడవడానికి దోహదం చేసాయి. ప్రపంచ వ్యాప్తంగా జాతి, వర్ణ, వివక్షమీద జరుగుతున్న జరిగిన పోరాటాలు నా దృష్టిలో కొచ్చాయి. అందులో నల్లవాళ్ల పాత్ర ఉత్తుంగా ఉండటంగమనించాను.

బానిస బతుకులకు వ్యతిరేకంగా తనవారికోసం పోరాడి బలైపోయిన మొట్టమొదటి

[redacted]

సంబంధాలుండేది దళితుడికే... డప్పుకొట్టేది చెప్పులు కుట్టేది చస్తే మోసేది వెట్టి చేసేది దళితులే.. ఉత్పత్తి కోసం తన సర్వశక్తులనూ ధారబోస్తున్నది దళితులే' అన్నాడు సూర్యారావు.

నలుపుకిన్ని మూలాలున్నాయని ఇంత చరిత్రుందని లోతుల్లోకి పోతేగాని తెలియలేదు. మరింత లోతుల్లోకి పోయి చూస్తే మరెన్నో విషయాలు తెలిసాయి. ఆదివాసియైన మనుష్యుడు దళితుడే... ఆది కవియైన వాల్మీకి గిరిజనుడే.. భారత రాజ్యాంగ నిర్మాత దళితుడే ఆది భిక్షువు నల్లటివాడే.

దళిత మూలాలనన్నిటినీ వెతికినా నాకు నలుపు చరిత్రను తెలుసుకున్న నాకు నా నలుపు రంగును చూసుకొని బాధ, అవమానం పడాల్సిన అవసరం లేదనిపించింది. పైగా అన్ని ఉత్పత్తి శక్తులకు మూలమైన దళితుడిగా పుట్టినందుకు గర్వించాలనుకున్నాను. ఇవన్నీ తెలుసుకున్న నాలో రోజురోజుకూ ఆత్మవిశ్వాసం పెరిగింది.

అనేక సామాజికాంశాలపై దళితుల సమస్యలపై వ్యాసాలు రాసాను. దళితులుగా పుట్టినందుకు కించపడాల్సిన అవసరం లేదని పైగా గర్వపడాలని ప్రముఖ పత్రికల్లో విశ్లేషణాత్మకంగా వ్యాసాలు ప్రచురించాను. అవి దళితుల్లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని కల్గించాయని, కల్గిస్తున్నాయని వాటి ప్రభావం సమాజంపై చాలా వుందని నాకు రోజూ వస్తున్న లేఖలే చెబుతున్నాయి. అయితే ఎంత ప్రయత్నించినా మాలతి అభిప్రాయాలనైతే మార్చలేకపోయాను.. నిండైన డ్రెస్ మనిషిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని అంబేద్కర్ సూటుబూటులో ఎంతో హుందాగా కనబడేవాడని సూటుబూటు వేసుకోవడం ప్రారంభించాను.

నా డ్రెస్ చూసి మాలతి పకపకా నవ్వింది.

''మీరు సూటుబూటు వేసుకుంటే దిష్టిబొమ్మకు సూటు తొడిగినట్లుగా వుంది. అంటే మీరిప్పుడు అచ్చంగా దిష్టిబొమ్మలా వున్నారు'' అంది.

ఇక అప్పట్నుంచి జీవితంలో మరెప్పుడూ సూటు వేసుకోవద్దని నిర్ణయించుకున్నాను. యూనివర్సిటీ ప్రొఫెసర్నయినా మామూలు దుస్తుల్లోనే వుంటున్నాను.

''అదృష్టవశాత్తు పిల్లలిద్దరికీ నా రంగే వచ్చింది. బతికిపోయారు. నేను చెప్పిందే నిజమైంది'' అంది మాలతి.

''నా పోలికలున్నాయి కదా?'' అన్నాను నేను.

''పోలికలెవ్వరడిగారు? మీ రంగు రానందుకు సంతోషించాలి. వస్తే చచ్చేదాన్నే''

''మాలతీ మనం కలిసి కాపురం చేయబట్టి పదేళ్లు దాటుతున్నా నీలో ఏ మాత్రం మార్పు రాకపోవడం వింతగానే వుంది. నన్ను క్రొడంటూ పిలవడమూ మానుకోవడం లేదు... నువ్వో అప్సరసనను కుంటున్నావా? లేక నీ అంత అందగత్తె ఎవరూ లేరనుకుంటున్నావా? నీ తోలును చూసుకొనే కదా నీకంత పొగరు? నేను తలుచుకుంటే నీకంటె ఎన్నో రెట్లు ఎక్కువ అందమున్న స్త్రీతో సంబంధం పెట్టుకోగలను... నీలో సంస్కారమెప్పుడు వికసిస్తుంది? మార్పెప్పుడు వస్తుంది'' నా ఉద్యోగస్థితిని మేధావిగా వున్న పేరును మరిచిపోయి కోపంగా అన్నాను''.

నా మాటలకు పకపకా నవ్వింది మాలతి

''చీకటికీ మీకు తేడా కనబడదు. అలాంటి క్రొన్ని ఎవరో అప్సరస పెళ్లి చేసుకుంటుందట. చీకట్లో ఏం కర్మ పట్టపగలు కూడా మిమ్మల్ని చూసిన ఏ ఆడదయినా దడుసుకుంటుంది. మిమ్మల్ని

చూసి ఏ స్త్రీ దగ్గరకు రాదు. మీకంతగా కోరికుంటే ఎవరితోనైనా సంబంధం పెట్టుకోండి. నాకే అభ్యంతరమూ లేదు.''

ఆ మాటలు నన్ను మరింత వేదనకు గురిచేసాయి. నేనెంత మేధావిగా పేరు ప్రఖ్యాతలు పొందుతున్నా నా దేహం రంగు నన్ను వెంటాడుతూనే వుంది. నా దరిదాపులకు కూడా ఏ స్త్రీ రాదన్న మాటలు నన్ను మరింత బాధిస్తున్నాయి.

నా ప్రతిభా సామర్థ్యాలకు తోడు నాకున్న దళితుడనే యోగ్యతాపత్రం నన్ను ఏభై ఏళ్లు కూడా చేరుకోలేని వయసులోనే యూనివర్సిటీకి వైస్ ఛాన్సలర్‌ని చేసాయి. నా హోదా మరింత పెరిగింది. అయితే నా భార్య విసిరిన ఛాలెంజ్ నాలో ఆమెను మించిన సౌందర్యవతితో ఒక్కసారైనా శారీరక సంబంధం పెట్టుకోవాలన్న కోర్కెను బలీయం చేస్తుంది. అలాంటి సమయంలో నాతో ఓ అమ్మాయి పరిచయమేర్పరచు కుంది.

ఎంత అందమైన స్త్రీ అయినా ఆమె కాలిగోటికి కూడా సరిపోదు సౌందర్యాన్నంతా ఒక్కదగ్గర కుప్పబోస్తే ఆమవుతుంది. అత్యంత నేర్పరియైన శిల్పి చెక్కిన శిల్పంలా ఉందామె. అజంతా శిల్పానికి రామప్ప దేవాలయంపైనున్న సుందరి శిల్పానికి ప్రాణప్రతిష్ట చేస్తే ఎలా వుంటుందో అంతకంటే అందంగా ఉంటుందామె. కొద్దిరోజుల పరిచయంతోనే ఉపోద్ఘాతమేమీ లేకుండానే

''మీ గురించి మీ రాతల గురించి ఇతర అన్ని విషయాల గురించి నాకు బాగా తెలుసు. ప్రేమించడం లాంటి బరువైన డైలాగులు చెప్పడం నాకిష్టంలేదు. కాని నేను మిమ్మల్ని మనసారా ఇష్టపడుతున్నాను... మీ కభ్యంతరం లేకపోతే మనం పెళ్లి చేసుకుందాం'' అంది సుజాత.

ఆ మాటలు విని కొద్దిసేపు తేరుకోలేదు నేను. నా వయసులో సగమైనా లేని అందాలరాశి క్రోడంటూ ఎందరితోనో అవమానాల నెదుర్కొంటున్న నన్ను పెళ్లి చేసుకుంటాననడం నాకు దిగ్భ్రాంతినే కలిగించింది.

''నాకు భార్య, పిల్లలున్నారని నీకు తెలుసా? నాలో ఏం చూసి నాతో జీవితం పంచుకోవాలను కుంటున్నావు. నా రూపం కనబడితేనే ఏ ఆడదయినా జడుసుకుంటుందని నా భార్య పదే పదే చెబుతుంటుంది'' అన్నాను.

''కావచ్చు.. నా వల్ల మీ కుటుంబం ఆర్థికస్థితిలో ఏ ఇబ్బందులూ ఉండవు... నాకేదైనా చిన్న ఉద్యోగం చూపుతే నన్ను కాబోయే నా పిల్లలను పోషించుకోగలను.. నాకు మీ శరీరం రంగు కాని బాహ్య సౌందర్యం కాని కనపడటమే లేదు. దాంతో నాకు సంబంధం లేదు. నేనిష్టపడుతున్నది మీ మేధస్సుని...మనస్సుని. మీ మానసిక సౌందర్యాన్ని... మీ ఆదర్శ భావాలను'' అంది సుజాత.

''శరీరాలతో సంబంధం లేకుండా ఆడమగ ఇష్టపడడం సాధ్యమా?''

''అభిప్రాయాలు కలువనపుడు మన పక్కనున్న వాళ్లయినా ఆమడల దూరంలో ఉన్నట్టే కనబడతారు. అభిప్రాయాల లొక్కటైతే వేలాది మైళ్ల దూరమూ ప్రక్కనున్నట్టే ఉంటుంది. ప్రేమ, ఇష్టం అనేవి మానసికమైనవి..''

ఎన్నో ఇతిహాసాలు పురాణాలు తత్వగ్రంథాలు, ఆధునిక శాస్త్రాలనన్నిటినీ తిరగేసిన నాకే అమెకంత తాత్వికత, మానసిక పరిపక్వత ఎలా వచ్చాయో అర్థం కాలేదు... సుజాత నాకళ్లకిప్పుడు మరింత అందంగా కనబడుతుంది.

నేనింతకాలంగా కోరుకుంటున్నట్టు నా భార్యతో వాదిస్తున్నట్టు రంగుతో రూపంతో సంబంధం లేకుండా నన్ను నన్నుగా ప్రేమించే స్త్రీ దొరికినందుకు ఆనందించాలా? లేక? నన్ను నేనే ప్రశ్నించుకున్నాను..

నా కుటుంబం, ఉద్యోగ హోదా, మేధావిగా నాకున్న పేరు, ఆదర్శాలు, నేను పొందుతున్న అవమానాలు అన్నిటిని గూర్చి దీర్ఘంగా ఆలోచించాను. నా భార్యకు నేనంటే చులకన భావమున్నా మేమిద్దరం శారీరక సౌఖ్యాల ననుభవిస్తూనే వున్నాం. సుజాతతో సంబంధం పెట్టుకుంటే మా జీవితంలో, కుటుంబంలో కల్లోలం లేవక తప్పదు. కాని మాలతిని మించిన అందగత్తెతో శారీరక సౌఖ్యం పొంది ఆమెపై కసి తీర్చుకోవాలని నాలో అంతర్లీనంగా వున్న కోర్కె సంగతి? బాగా ఆలోచించిన నాకు సుజాతతో సంబంధం పెట్టుకోవడమెంత అసంబద్ధమైనదో అర్థమైంది. నాలోని వివేకం కసిని జయించింది. ఆమె ప్రతిపాదనను సున్నితంగానే తిరస్కరించాను.

''నేను మీ కుటుంబంలోని ఏ విషయంలోనూ జోక్యం కలిగించుకోను. మీతో జీవితం చాలు. మీ మేధస్సు, నా అందంతో మనకో కొడుకు పుడితే అంతకంటే కావాల్సిందేముంది?'' చివరి ప్రయత్నంగా అంది సుజాత.

''ఈ మాటలు ప్రపంచ ప్రఖ్యాతి వహించిన రచయిత, మేధావి జార్జ్ బెర్నార్డ్‌షాతో ఓ అపురూప సౌందర్యరాశి అన్నమాటలు. నువ్వా అమ్మాయంత అందగత్తెవేనేమోగాని నేను మాత్రం బెర్నార్డ్‌షా అంత మేధావిని కాను.. గొప్పవాన్ని కాను... అయితే బెర్నార్డ్‌షా ఆ యువతికిచ్చిన జవాబే నీకిస్తున్నాను... నువ్వన్నట్టు జరిగితే మంచిదే... కాని అందుకు విలోమంగానూ జరిగే అవకాశాలున్నాయి. ఆ పుట్టేవాడికి నా అందం మాత్రమే వచ్చిందనుకో కష్టమేకదా'' అన్నాను.

ఆమెను పంపించాను... ఆ ఆలోచన మానుకొమ్మన్నాను... అయితే ఆమె రూపం నా కళ్లముందు సజీవంగా, సౌందర్యానికి ప్రతిరూపమన్నట్టుగా కదులుతూనే వుంది.

రెండు నెలలు గడిచాయి. దక్షిణ భారతదేశ యూనివర్సిటీ ఉపాధ్యాయుల సమావేశానికి మద్రాసువెళ్లి ఆరోజే వచ్చాను. దసరా సెలవులు... నా భార్య పిల్లలెవరూ ఇంట్లో లేరు. మాలతి వాళ్ల తల్లిగారింటికెళ్లారు...

ప్రయాణంలో జబ్బుపడున్న నేను మంచంలో పడుకున్నాను. ఉన్నట్టుండి విపరీతంగా వాన కురవడం మొదలైంది. పూనకం వచ్చినట్లు చెట్లూగుతున్నాయి... చలిగాలి ఉధృతంగా వీస్తుంది. చలిలో నా శరీరం వణికిపోతుంది. కిటికీలు తలుపులు మూసే ఓపిక కూడా లేదు. గజగజ వణుకుతున్న నా శరీరంపై ఓ చల్లని చేయిపడింది. ఆ స్పర్శ నాకెంతో ఆత్మీయంగా వుంది. ఎన్నో ఏళ్లుగా నేనా స్పర్శకోసమే ఎదురు చూస్తున్నట్టనిపించింది. తరతరాల యుగయుగాల నిరీక్షణ తర్వాత లభించిన స్పర్శలా వుందది. ఓ దిక్కు చలిగాలి, వర్షం... వణుకుతున్న శరీరం. నా పరిస్థితిని గమనించిన ఆమె నా శరీరంతో తన శరీరాన్ని కలిపింది. నాలో లీనమైపోయింది. మా రెండు శరీరాలేకమైపోయాయి. నేనా కలయికలో ఎంతో తాదాత్మ్యం చెందాను. మాలతితో ఇరవై ఏళ్లకుపైగా దాంపత్య జీవితం గడుపుతున్నా నేనింత తాదాత్మ్యం పొందలేదు. జీవిత కాలానికంతా సరిపోయే సుఖాన్నిచ్చిందామె.

నేనా తాదాత్మ్యం నుంచి అలౌకిక మానసిక స్థితి నుంచి తేరుకునేలోపలే సుజాత ఒక్కమాట కూడా మాట్లాడకుండా వెళ్లిపోయింది.

నాలుగు నెలల తర్వాత నన్నో హోటల్లో కలుసుకుంది... తాను గర్భవతినని, తల్లిదండ్రులబార్షన్ చేయించుకొమ్మంటే చేయించుకోలేదని, తనను ఇంటి నుంచి గెంటివేసారని చెప్పింది.

ఆ మాటలు విన్న నా కాళ్లకింది భూమి కదలుతున్నట్టనిపించింది... ఈ విషయం సమాజానికి తెలిస్తే ఏమవుతుందో ఆలోచించాను.

''సుజాతా! నేను దోషినే. కాదనడంలేదు. కాని నేనిప్పుడు నిన్ను ఏవిధంగానూ స్వీకరించలేను. అంత మనోధైర్యం నాకు లేదు. ఈ రహస్యం మనిద్దరి మధ్యనే ఉండాలి. ఈ సమాజంలో ధైర్యంగా నిల్చుని బతకగలిగే మనోధైర్యం నీకు కలగాలని కోరుకుంటున్నాను. నన్ను క్షమించు'' అని పదివేల రూపాయలు ఆమె చేతిలో పెట్టి పంపించాను.

మాలతికి కాని మరెవ్వరికి కాని ఈ విషయం చెప్పదలచుకోలేదు. మాలతికి సుజాత విషయం తెలుసో తెలియదో నాకు తెలియదు. ఆమెలో మార్పు నిజంగా వచ్చిందో సుజాత విషయం తెలుసుకొని తనకేం తెలియనట్టు నటిస్తుందో నాకసలే తెలియదు. కాని సుజాత వెళ్లిపోయిన ఆర్నెలల నుంచి మాలతిలో చాలా మార్పు రావడం గమనించాను. ఆమె మునుపట్లా నన్ను అనుమానపరుస్తూ పిలవడంలేదు. నా రూపాన్ని కించపరచడంలేదు. ఆమె స్పర్శలో మాటల్లో శరీరాన్ని అర్పించడంలో వచ్చిన మార్పును గమనించాను. ఈమార్పుకు గల కారణాన్ని మాలతినే అడిగాను.

''మిమ్మల్ని రెచ్చగొట్టి మీలోని ప్రతిభను, మేధావితనాన్ని వెలికితీయాలనే అలా ప్రవర్తించాను కానీ వేరే కాదు... మీరంటే నాకేం ఏవగింపులేదు''.

ఆమె మాటల్లో ఎంత నిజముందో నాకెంత ఆలోచించినా అర్థంలేదు. ఏదేమైనా ఆమెలో మార్పు రావడం నాకెంతో ఆనందహేతువైంది. ఈసంతోషంలో నేను సుజాత గూర్చి ఆలోచించలేదు. ఆమె ఏమైందో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు.

నా ఆర్థిక స్థితిలో మరింత మార్పు వచ్చింది. క్రమక్రమంగా నేను సౌందర్యారాధకుడిగా మారిపోయాను. నాకు తెలియకుండానే నాకు నలుపంటే అసహ్యం ఏర్పడింది. నేను పడ్డ అవమానాలు, నన్ను వేదనకు గురిచేసిన సంఘటనలు, నన్ను ప్రభావితం చేసిన రచనలు నన్ను దళిత సంస్కృతిని ప్రేమించేట్టు చేసినా దానిపై ఏండ్ల తరబడి పరిశోధనలాంటివి చేసినా ఈ మధ్య నలుపంటే అసహ్యించుకునేట్టు ఎందుకైందో నా కర్థం కాలేదు.

బాబు చివరి మాటలు నన్ను మేల్కొల్పాయి.

★★★

లేచి మంచంలో కూర్చున్నాను.

అంటే సుజాత కొడుకైన ఆ బాబు నా కొడుకే. నా రక్తం పంచుక పుట్టినవాడే. నా పేగు బొర్లింది. నా రూపు, నాస్వంత పిల్లలకు రాలేదు. నన్ను మనసారా కోరుకున్న సుజాత కొడుక్కు వచ్చింది. అంటే మరో కర్రోడు నా వారసుడుగా ఈ ప్రపంచంలో కొచ్చాడన్నమాట.

నేనిప్పుడా బాబును పట్టించుకోకుంటే తల్లిలేని, తండ్రెవరో చెప్పుకోలేని ఆ బాబు ఎన్నో అవమానాల నెదుర్కోక తప్పదు. ఆ అవమానానికి తోడు రూపం, రంగుతో వచ్చే అవమానాలు. నిజంగా ఆ బతుకెంత రంపపుకోతో నాకు తెలియంది కాదు. రకరకాల ఆలోచించాను.

అయితే రంగు పేరుమీద, కులం పేరుమీద ఎన్నో అవమానాలు పొంది ఎంతో వేదనుభవించిన నేను ఈ మధ్య నలుపునెందు కసహ్యించుకుంటున్నాను? సమాజంలో నా స్థానం పెరగానే మేధావిగా నా స్థానం పదిలపడగానే నా భార్యలో మార్పు రాగానే నాలో మార్పు వచ్చిందా? దళితుడిగా పుట్టి

అందులోని కొన్ని సౌకర్యాలను పొంది తన పరిస్థితి మారగానే దళితులుగా చెప్పుకోవడానికి కించపడే దళితులనే మాత్రం పట్టించుకోని వాళ్ళకోవలోకే వస్తాడా తాను? నాలోని మానవతా దృక్పథం, దళితవర్గాలపట్ల ప్రేమానురాగాలు నా వ్యక్తిగత జీవితంలోని వేదనవల్ల కలిగినవేనా? ఆవేదనే నన్ను రచయితను, పరిశోధకున్ని, సామాజిక చిత్రకారున్ని చేసిందా? లేక నా భార్య అందాల మోజులోపడి నేనన్నీ మరచిపోయానా?

నాలో ప్రశ్నలు... ప్రశ్నలు... ప్రశ్నలు...

కాని నేనిప్పుడవన్నిటిని గూర్చి ఆలోచించ దలుచుకోలేదు.

నా కొడుకు మరో కర్రోడుగా బతకడానికి వీల్లేదనుకున్నాను.

అతనితో ప్రవర్తించిన తీరు జ్ఞాపకం రాగానే నా కళ్లవెంట పటపటా నీళ్లు కారుతున్నాయి.

సమాజం కట్టుబాట్లు, హోదా, రేపు నా జీవితంలో, కుటుంబంలో లేవబోయే కల్లోలం ఇవేవీ నాకు గుర్తుకు రావడంలేదు.

నా జీవిత లక్ష్యాన్ని తాత్కాలికంగానైనా మరిచిపోయిన నన్ను కారణాలేవైనా గమ్యం, దిక్కు మరల్చిన నా కర్రోడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ ఆతని కోసం పరుగెత్తుతున్నాను.

గబ్బిలం మాసపత్రిక

దళిత కథలు -7వ సంపుటిలో



దళితం